క్లుప్తంగా

ర్యాంకర్లకు నగదు ప్రోత్సాహం



నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

పెనగలూరు: జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2024–25 సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చూపి మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు దాత చెంగల్‌రాయుడు ప్రోత్సాహక నగదు అందజేశారు. విద్యార్థినులు మన్వితకు రూ.5వేలు, మేఘనకు రూ.3వేలు, కుసుమకు రూ.2 వేల నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పెనగలూరు పంచాయతీకి చెందిన నరసాపురం శేషయ్య మెమోరియల్ ట్రస్టు తరపున 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి రూ. 2 వేల చొప్పున నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు.

చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు గ్రామానికి చెందిన చేకూరి రమణయ్య నాయుడుకు రూ.12,23,041, మంగంపేట గ్రామానికి చెందిన ఎడగుట్టి దుర్గమ్మకు రూ.1,57,260ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అరవ శ్రీధర్ శనివారం అందజేశారు. మండల కేంద్రంలోని టంగుటూరి చిన్నారప్పగారి పాపిరెడ్డికి రూ.30276లు అందించారు. ఈ కార్యక్రమంలో కె చలపతి, టి.ఈశ్వరయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబీకులకు పరామర్శ



పరామర్శిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

సంబేపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ అనిల్ కుమార్‌రెడ్డి శనివారం ఆవులవాండ్లపల్లెకు చేరుకొని తన సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలను ఆయన పరామర్శించారు.

కొత్త జిల్లాల్లో రాయచోటి లేకపోవడం బాధాకరం

రాయచోటి జగదాంబసెంటర్: నిరాహార దీక్షలు, ఉద్యమాలు చేసి రాయచోటి జిల్లా సాధిస్తే సీఎం చంద్రబాబునాయుడు కొత్త జిల్లాల్లో రాయచోటి పేరు లేకుండా చేయడం బాధాకరమని అన్నమయ్య జిల్లా సాధన కమిటీ ఉపాధ్యక్షుడు సిబ్యాల విజయ భాస్కర్ అన్నారు. రాయచోటి పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు జిల్లాల పునర్విభజన పేరుతో రాయచోటిని తొలగించాలని చూస్తున్నారన్నారు. నియోజకవర్గ వాసి అయిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవ తీసుకొని రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగేలా పోరాడాలని కోరారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

సుండుపల్లె: మండలంలోని రాయవరం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బద్రిరమేష్ తండ్రి వెంకటరమణ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి శనివారం ఉదయం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఇస్మాయిల్, వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెహమాన్‌ఖాన్, చంద్రా నాయక్ పాల్గొన్నారు.

మాతమ్మ తిరుణాలకు విరాళం



నగదు అందజేస్తున్న కార్యకర్తలు

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని అయ్యవారిపల్లి అరుందతివాడలో నిర్వహించనున్న మాతమ్మ తిరుణాలకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గౌతమ్, గిరి, తదితరులు రూ.35వేల విరాళం అందజేశారు. తిరుణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు.

కమనీయం.. వేణుగోపాలస్వామి కల్యాణం

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి



రాజంపేట రూరల్: ఎంజీపురంలో వేణుగోపాలస్వామి కల్యాణం



నందలూరు: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకను మండలంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. పట్టణంలోని రామనగర్, మదనగోపాలపురం, అచ్చనపల్లి ప్రాంతంలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. వేదపండితులు, పురోహితులు వేద మంత్రాల మధ్య కల్యాణ క్రతువు జరిపించారు. ఈ వేడుకలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాదం అందజేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు.

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రామనగర్, అచ్చనపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయంలలో నిర్వహించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీకృష్ణుడి కల్యాణం

నందలూరు: మండలంలోని అరవపల్లి గీతామందిరం ఆవరణలో అశేష భక్తుల మధ్య శనివారం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణం కమనీయంగా జరిగింది. వేద పండితులు బండిఆత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను వివిధ పుష్పాలతో అలంకరించి వేదికపై ఆసీనులను చేశారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. కల్యాణ ఉభయదారులుగా భారతాల శ్రీధర్‌బాబుయాదవ్, సుప్రియ దంపతులు, కుర్ర మురళీకృష్ణయాదవ్, వెంకట వాసవి దంపతులు వ్యవహరించారు. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్‌కుమార్ దంపతులు అందజేశారు. చిన్నారులను తల్లిదండ్రులు చిన్నికృష్ణుడిగా అలంకరించి కళ్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ముందుగా తాటి సుబ్బరాయుడు, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి కోలాటం, డప్పువాయిద్యాలు, బాణసంచా నడుమ స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి, అలివేలి మంగ, ఆంజనేయస్వామి వేషధారణలో భక్తులను పలువురు ఆకట్టుకున్నా,రు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగెలసౌమిత్రి, గుండు మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, బయనబోయిన భాస్కర్‌యాదవ్, ఆనాల మధుయాదవ్, మధురాజు, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, పునగాని గుణయాదవ్, పుత్త శంకర్, నాగేశ్వర్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, ఐబ్బు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్: రాయచోటి మండలం యండపల్లె సమీపంలోని భైరవుడి గుట్టపై వెలసిన కాలభైరవుడికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, పూజలు నిర్వహించి రౌద్రం రూపంలో అలంకరించారు.

రాధాకృష్ణులకు అభిషేకం

సిద్దవటం: సిద్దవటం సమీపంలోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద వెలసిన రాధా కృష్ణ స్వామికి వేదపండితులు హరిప్రసాద్ శర్మ, నరసింహశర్మ శనివారం అభిషేకం జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

రైల్వేకోడూరు అర్బన్: మండలంలో కృష్ణాష్టమి వేడుక వైభవంగా నిర్వహించారు. మైసూరావారిపల్లిలోని శ్రీకృష్ణ దేవస్థానంలో మూలవిరాట్ కు పంచామృతాభిషేకం చేసి అలంకరించారు. అనంతరం శ్రీకృష్ణ, రుక్మిణీ కల్యాణం భక్తుల మధ్య కన్నుల పండువగా చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కోదండరామాలయంలో శ్రీకృష్ణ పరంధాముడికి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పారాయణం, ఉట్టి ఉత్సవం నిర్వహించారు.

పెనగలూరు: పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులు అల్పాహారం అందజేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓ యువకుడు ఉట్టి కొట్టి రూ.1516 గెలిచారు.

ఓబులవారిపల్లె: మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కృష్ణ మందిరాల్లో చిన్ని కృష్ణుడి పాదాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో గోపిక, కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిట్వేలి: మండలంలోని చిల్లావాండ్లపల్లిలో ఆలయానికి రంగులద్ది విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి అన్నదానంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గాలివీడు: మండలంలోని అరవీటివాండ్లపల్లెలోని శ్రీకృష్ణ వేద పండితులు నాగ ఫణికిశోర్‌శర్మ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్న పిల్లలు కృష్ణుడి వేషధారణతో ఆకట్టుకున్నారు. పెద్దూరు బ్రాహ్మణ వీధి వేంకటేశ్వరాలయం, అరవీడు ఆంజనేయస్వామి, గేటు కోదండ రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గండిమడుగులో భక్తులు స్నానం చేసి అంజన్నను దర్శించుకున్నారు. దేవర కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాలైన కొర్లకుంట, పందికుంట, తలముడిపి, నూలువీడు, బోరెడ్డిగారిపల్లి, పూలికుంట, సీసీ.పల్లి నుంచి ప్రజలు తరలివచ్చారు.

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని వేంపల్లి–రాయచోటి జాతీయ రహదారి ప్రక్కన గల శ్రీ కృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. చిన్ని కృష్ణుడి వేషధారణలో పిల్లలను అలంకరించి స్వామి వద్ద భజన నిర్వహించారు. ధర్మకర్త, న్యాయవాది చెన్నకృష్ణయ్య ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు.

పుల్లంపేట: మండలంలోని రామసముద్రంలో వెలసిన శ్రీకృష్ణుడి ఆలయంలో స్వామి, అమ్మవారి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. అనంతరం డప్పు వాయిద్యాల మధ్య స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.



గ్రామోత్సవానికి బయలుదేరిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



పెనగలూరు: ఆలయం ఎదుట ఉట్టికొడుతున్న యువకులు



రైల్వే కోడూరులో శ్రీకృష్ణుడి కల్యాణం



రెల్వేకోడూరు అర్బన్: స్వామికి గ్రామోత్సవం

శ్రావణ శనివారం.. ఆంజనేయుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి పట్టణ పరిధిలోని కొత్తపేట గ్రూప్ థియేటర్స్ వద్ద వెలసిన ప్రసన్న ఆంజనేయ స్వామి, బ్రాహ్మణ వీధిలోని హనుమాన్, మాసాపేటలోని గండ్రాంజనేయస్వామి, సుండుపల్లె మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ శనివార పూజలు జరిపారు. స్వామి మూల విరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అర్చకులు సింధూరం, ఆకు పూజ క్రతువు నిర్వహించగా సమీప ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

సంబేపల్లి: మండలంలోని శెట్టిపల్లె, గుట్టపల్లె, సంబేపల్లె, నారాయణరెడ్డిపల్లె, దుద్యాల, మోటకట్ల, రౌతుకుంట, దేవపట్ల, ఎస్.సోమవరం, గున్నికుంట్ల, గురిగింజకుంట, దుద్యాల, పిఎస్‌కాలనీ తదితర గ్రామాల ఆంజనేయస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిన్నమండెం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ఆకు పూజ, సింధూర పూజలను నిర్వహించారు.

వీరబల్లి: మండలంలోని మాండవ్య నది ఒడ్డున వెలసిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆర్ఎంపీ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఆంజనేయస్వామికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన బృందం భక్తి పాటలతో అలరించారు.

సిద్ధేశ్వరస్వామి గ్రామోత్సవం



సిద్ధేశ్వరస్వామి, అమ్మవారికి గ్రామోత్సవం

రాజంపేట: తాళ్లపాక సిద్ధేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం సిద్ధేశ్వరస్వామికి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

రాయచోటి టౌన్: రాయచోటి మార్కెట్ ప్రాగణంలో రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు సాగించరాదని రాయచోటి మున్సిపల్ కమిషనర్ జి.రవికుమార్ సూచించారు. రాయచోటి పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న మార్కెట్ వ్యాపారులతో ఆయన మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు, ఆక్రమణలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మార్కెట్ లోపల ఖాళీ స్థలంలోనే వ్యాపారాలు నిర్వహించుకోవాలని, కూరగాయల అమ్మకాల ద్వారా ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు అప్పగించాలని చెప్పారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్‌కు వచ్చేవారంతా తప్పకుండా తమ వెంట గుడ్డ సంచి, లేదా జూట్‌బ్యాగ్ తెచ్చుకోవాలని సూచించారు.

పెన్నానది వద్దకు ఎవరూ వెళ్లవద్దు



కాజ్‌వే వద్ద నీటిని పరిశీలిస్తున్న సీఐ బాబు

సిద్దవటం: ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు సిద్దవటం వద్ద పెన్నానదిలో నీటిమట్టం పెరుగుతోందని.. నది వద్దకు ఎవరూ వెళ్లవద్దని ఒంటిమిట్ట సీఐ బాబు హెచ్చరించారు. నదిపై లో లెవల్ కాజ్‌వేను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెన్నానదిలో నీటిమట్టం రెట్టింపు అవుతోందని చేపల వేటకు జాలరులు వెళ్లవద్దన్నారు. లో లెవల్ కాజ్‌వే వద్ద ఎవరైనా సంచరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెన్నాలో నీరు తగ్గేంత వరకూ ఇద్దరు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తవ్యక్తులు ఎవరైనా సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, పోలీసులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకి నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నందలూరు: స్వాతంత్య్ర సమరయోధులు సర్దార్ గౌతులచ్చన్న జయంతి సందర్భంగా శనివారం పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. లయన్ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ కుర్రా మణియాదవ్, మోడపోతుల రాము, గంధం గంగాధర్, జంగంశెట్టి హరి, సునీల్‌రెడ్డి, కుర్రా మురళి, ఆంజనేయులు, నల్ల తిమ్మాయిపల్లి ఈశ్వరయ్య, కుర్రా వంశీ, మహిళలు, విద్యార్థులు పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్నకి ఘనంగా నివాళులర్పించారు.

రూ.కోటికి పైగా పెండింగ్‌లో ఉపాధి బిల్లులు

పెద్దతిప్పసముద్రం : ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలానికి సంబంధించి రూ.కోటికి పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కూలీలకు సంబంధించి ఆరు వారాల బిల్లులు వారి ఖాతాల్లోకి పడకపోవడంతో పనులు చేసేందుకు కూలీలు అనాసక్తి చూపుతున్నారు. 20 గ్రామ పంచాయతీలు ఉండగా మండల వ్యాప్తంగా కేవలం కూలీల సంఖ్య 250 మందికి మించకపోవడం ఇందుకు నిదర్శనం. అంతేగాక మండలంలో ఒకొక్కటి రూ.32 వేల అంచనాతో మండలంలో 38 పశు నీటి తొట్టెల నిర్మాణం పూర్తయి నాలుగు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఎలాంటి బిల్లులు మంజూరు కాకపోవడం శోచనీయం. అదే విధంగా మండలంలో 43 గోకలాల షెడ్లు కడితే మొదటి విడతగా అన్ని గోకులాలకు కలిపి రూ.42.50 లక్షలు మంజూరు కాగా మిగిలిన బిల్లులు మాత్రం పెండింగ్‌లో నిలచిపోయాయి. అధికారులు చూస్తే బడ్జెట్ రిలీజ్ అయ్యే వరకు వేచి చూడాల్సిందేనని చెబుతున్నారు.

సమస్య పరిష్కరించాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

మదనపల్లె సిటీ : పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సబ్ కలెక్టర్ కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. పట్టణంలో రోడ్లపై ఆక్రమణలు తొలగించి, విస్తరణ చేయాలని కోరారు. పార్కింగ్ స్థలాలు, రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని తెలిపారు. అధికారులతో సమీక్షించాలని కోరారు. గొల్లపూడి తిరుపతిరావు, పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నారసింహుడికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామున అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై ఆరోగ్యశాఖ మంత్రి



బీజేపీ నాయకులతో మంత్రి సత్యకుమార్ యాదవ్

బి.కొత్తకోట : వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండలంలోని హార్సిలీహిల్స్‌పై విడిది చేశారు. శుక్రవారం రాత్రి ఇక్కడికి వచ్చిన ఆయన గవర్నర్ బంగ్లాలో విడిది చేశారు. కొండపై పర్యటించిన ఆయన ప్రకృతి అందాలను తిలకించారు. అటవీ ప్రాంగణం పరిశీలించారు. శనివారం ఆయన్ను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, గుత్తా హరికృష్ణ, గోరంట్ల రమేష్, ఆకులవారిపల్లె సురేంద్రరెడ్డి, గోల్డెన్‌వ్యాలీ చైర్మన్ రమణారెడ్డి, శోభారాణి, వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ నేతలు వచ్చి కలిశారు.

మూడు దశాబ్దాల తర్వాత అపూర్వ కలయిక



వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నాటి విద్యార్థులు

బి.కొత్తకోట : కలిసి ఐదేళ్లపాటు న్యాయ విద్య అభ్యసించి ప్రస్తుతం వివిధ హోదాల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా 30 ఏళ్ల తర్వాత బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై శనివారం కలుసుకుని సరదాగా గడిపారు. పాండిచ్చేరి అంబేద్కర్ న్యాయ కళాశాలలో 1989–94 మధ్య వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు న్యాయ వ్యవస్థలో మెజిస్ట్రేట్లు, న్యాయవాదులు, లీగల్ అడ్వయిజరీ ఇలా వృత్తిపరంగా వివిధ చోట్ల పని చేస్తున్నారు. వీరితో కలిసి చదువుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఎస్.అనీషారెడ్డి ఒకరు. నాటి న్యాయ విద్యార్థులతో సమావేశం కావాలని నిర్ణయించిన ఆమె అందర్ని ఇక్కడికి ఆహ్వానించారు. కొండపైన విడిది చేసిన 30 మంది నాటి విద్యార్థులు హార్సిలీ హిల్స్‌పై సమావేశం అయ్యారు.

వీధి వీధినా రహదారులపై పశువులే..

- పదుల సంఖ్యలో రోడ్లపై తిష్ట
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రాయచోటి - సుండుపల్లె రోడ్డు మార్గంలో ఆవులు

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి పట్టణంలో పశువుల బెడద నానాటికీ జఠిలమవుతోంది. రాయచోటి మున్సిపల్ పరిధిలో పదుల సంఖ్యలో పశువులు రోడ్డుపైనే ఉంటున్నాయి. పెంపకందారులు మేత కోసం వాటిని రోడ్లపై వదిలేయడంతో ప్రతి వార్డులోనూ ఆవుల సంచారం పెరిగిపోయింది. రోడ్డుకు అడ్డంగా వస్తుండడంతో వాహనదారులు వాటిని ఢీకొని కిందపడి గాయపడిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రధాన మార్గాల్లో అడ్డుగా వచ్చిన పశువులను తప్పించే క్రమంలో కింద పడిన వాహనదారులు గాయాలపాలయ్యారు. రాయచోటి మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారితోపాటు కూరగాయల మార్కెట్‌లో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి.

ప్లాస్టిక్, వ్యర్థాలతో ఆరోగ్యంపై ప్రభావం

పట్టణ పరిసరాల్లో నివాసముంటున్న పశుపోషకులు పశువుల సంరక్షణ గాలికి వదిలేశారు. ప్రభుత్వం సైతం గో సంరక్షణ పథకాన్ని అటకెక్కించడంతో పశుగ్రాసం అందక పలువురు రోడ్డుపైనే వదిలేస్తున్నారు. దీంతో ఆకలితో అలమటిస్తున్న ఆవులు చెత్త దిబ్బలు, కంపోస్టు యార్డుల్లోని చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తినడంతో వాటి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. అంతేగాక వీటి పాలను ఆహారంగా తీసుకున్న ప్రజలు సైతం అనారోగ్యం బారిన పడుతున్నారు.

గోశాల ఉన్నా

వీధి పశువుల సంరక్షణకు రాయచోటి పట్టణ శివారులో గోశాల నిర్వహిస్తున్నారు. ఆవులను అక్కడకు తరలించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవచ్చు. అయితే ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి. గతంలో పశుపోషకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు కానీ తదుపరి చర్యలు చేపట్టడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ఆవుల సంచారాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. పట్టి గోశాలకు తరలించాలని వేడుకుంటున్నారు.

చినుకు పడితే బురదమయం



పెనగలూరు తహసీల్దారు కార్యాలయానికి 50 మీటర్ల దూరంలోని రహదారులు చినుకుపడితే బురదతో నిండి కనిపిస్తున్నాయి. ఆ రోడ్డులో నడచి వెళ్లలేక ద్విచక్ర వాహనదారులు మెయిన్ రోడ్డులోని ఏదో ఇంటి వద్ద నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఆదమరిచి బురదలో వెళ్లినవారు కిందపడిపోతున్నారు. రోడ్డు హాస్టల్ విజయ్‌కుమార్ వీధిలో వాహనాలు వెళ్లేందుకు కానీ వీలుపడడం లేదు. ఈ వీధి వాసులు గాంధీ నగర్ ఎస్టీ కాలనీ నుంచి వెళ్తున్నారు. అధికారులు, పాలకులు రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. – పెనగలూరు